
# వర్షం

బెలగాం భీమేశ్వరరావు



ఆశ్వీయుజ మాసం! వర్షాలు ఎత్తిపెట్టే సమయమే కానీ బంగాళాఖాతంలో అల్పపీడనం వల్ల భారీ వారంరోజులనుంచి కుండపోతగా కురుస్తూనే ఉంది.

సోములుకు రెక్కాడితే గానీ డొక్కాడని బతుకు! బాధ్యతలు పులిమీద పుట్రలా తన బతుకుమీద పడినా, తుఫాను దాడికి లొంగని గరికపూచలా నిటారుగా నిలదొక్కుకునే కుర్రతనం సోములుది.

తన కుర్రవయస్సులో తండ్రి మరణించాడు. ఇంటిమీద కొంత అప్పు, తల్లి బాధ్యతా నెత్తిమీద హఠాత్తుగా పడ్డాయి. బాధ్యత తెలియని వయసది. మోయలేని బరువయినా దుఃఖంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తల్లిని చూచి బరువు

నెత్తిన వేసుకున్నాడు. తండ్రి తనకోసం వదలి వెళ్లిన ఎడ్లబండినే తన బతుకుబండిగా ఎంచుకున్నాడు. కాలగమనంలో తల్లి మరణించింది.

సోములిల్లు పూర్తిగా పాడయిపోయింది. ఏనాడు కట్టినదో! బాగుచేయాలంటే వందలూ వేలూ కావాలి. గ్రామాధికారిని కలిసి సోములు గోడు వినిపించాడు. ప్రభుత్వ సహాయం కోరాడు. గ్రామాధికారి అర్జీ అందుకున్నాడు. నెలలూ, సంవత్సరాలూ గడిచాయి. పెట్టమన్నప్పుడల్లా అర్జీలు పెడుతూనే ఉన్నాడు. ఏ అర్జీకీ, ఏ సమాధానమూ రాలేదు. ఏ మాటా తెలియలేదు.

సోములు ఆలోచనలలాగే, బయట వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది.

కుక్కిమంచంపై చేరగిలబడి ఇల్లాలు నిప్పంటించి ఇచ్చిన చుట్టపీకను నోట్లో పెట్టి గట్టిగా పీల్చి గుండెలనిండా పొగ నింపుకుని పలకబారాడు. దగ్గి దగ్గి ఆయాసం తెచ్చుకుని కళ్లు మూసుకున్నాడు. అసౌకర్యంగా ఇటూ అటూ కదలి ఒకవైపే ఒత్తిగిల్లి పడుకున్నాడు.

ముంజూరు నుండి ఖాళీ లేకుండా నీటిధారలు పడుతున్నాయి. అతని మనస్సునిండా ఆలోచనలే!

ఇరవై సంవత్సరాల గతంలోకి అతని ఆలోచనలు వెళ్లాయి.

పల్లెలకు రహదారి సౌకర్యాలు లేని కాలమది. ఎంత లక్షాధికారులైనా బండిని నమ్ముకుని ప్రయాణానికి ముహూర్తం కట్టవలసినదే.

కొత్తపల్లి, పార్వతీపురం పట్టణానికి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామం. ఆ ఊరినుంచి పట్నం పోవాలంటే రెండు మార్గాలుండేవి. ఐదు కిలోమీటర్లు నడచి 'కెల్ల' అనే గ్రామం వద్ద నాగావళి ఏరు దాటి తార్రోడ్డుకు చేరుకుని బస్సులో పార్వతీపురం చేరుకోవాలి.

మరొక మార్గం రావులపల్లి గరుగుబిల్లి మీదుగా దాదాపు ఇరవై కిలోమీటర్లు నడిచి వెళ్తేగానీ పార్వతీపురం చేరరు.

ఆ రోజుల్లో సోములు బండే కొత్తపల్లికి గతి. పెళ్లికూతుర్ని తేవాలంటే సోములు బండి ఉండాలి. పెళ్లి సామాను తేవాలంటే సోములు బండి ఉండాలి! పట్నంలోని బంధువులిళ్లకు పోవాలంటే సోములు బండి ఉండాలి ... బంధువులను ఇంటికి తీసుకురావాలన్నా సోములు బండి ఉండాలి. పచారీ కొట్టు సామాను పట్నం నుండి తేవాలన్నా సోములు బండి ఉండాలి.

కొత్తపల్లి ఊరికి తలలో నాలుకలా ఉండేవాడు సోములు. సేవా దృక్పథమే కానీ ఆర్జనా సహజాతం లేని మనిషి అతడు! అయినా ఊరివాళ్లు అతని కష్టాన్ని ఉంచుకోలేదు. ఏదో రూపంలో సోములింటికి సాయం చేస్తూండేవారు. అందువల్లే ఇంటిమీద అప్పు రెండు మూడేళ్లలో తీర్చగలిగాడు. తండ్రి చనిపోయినా, తండ్రికి చేదోడు వాదోడుగా ఉండే అప్పన్న తాతమాత్రం ఏ దిక్కూ లేక తననే ఆశ్రయించుకుని ఉన్నాడు. వాడి బాధ్యతా తనదే అయింది.

ఆ ఊరి పిల్ల సీతాలు ఏరి కోరి సోములుకు ఆలిగా వచ్చింది. భర్త కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ సంసారరథం ఎలాగోలాగ నడుపుతోంది.

వాన తగ్గలేదు. గాలి వీస్తోంది. హఠాత్తుగా దగ్గరలోనే పిడుగు పడిన చప్పుడు. "సీతాలూ! ఎంత పెద్ద పిడుగే, తుళ్లిపడ్డాను!" ఆలోచనలనుంచి ఊడిపడ్డాడు సోములు.

వంటింటి నుంచి గాబరాగా సీతాలు వచ్చింది. "పెద్ద పిడుగే పడింది!" అంటూ. "పట్నానికి బేరమేమైనా కుదిరిందేటి?" అంది. పట్నానికి బేరం కుదిరితే సీతాలుకు పండగ. ఇంటికి వెచ్చాలు వస్తాయని ఆమె ఆశ.

"అంతపాటి అదురుష్టమా! తుపానసీసరికి బండి బేరం రావచ్చనుకున్నాను. ఈ ఆర్టీసీ బస్సులొకటి కదా! ఎంత జీమూతం కమ్మేసినా పారొస్తాయి. మరి మన బండెవడు పట్టించుకుంటాడు?"

"మరెలాగయ్యా! ఇంట్లో బియ్యం నేవు. తిండికి మనమీద ఆశపడతాడు అప్పన్న తాత. ఆడొచ్చేసరికి ఇంత గెంజయినా ఉండాలి కదా! ఆకలితో ఎలా ఎలిపోమంటాను?"

"పోనీలేయే, మనతోపాటు యేదుంటే అది. ఆడినెప్పుడూ ఆకలితో పంపకు. ఆడికే పిల్లలూ పెళ్లామూ ఉంటే, మనకాశపడి మనింటికొస్తాడా! మా అయ్యతోటే బండి నొదిలీకుండా నాకు కూడా సాయం చేశాడు. అలాంటోడిని ఈ ముసలి వయస్సులో వొదిలీస్తామా? అలాగ సావుకారి కొట్టుకాడి కెలతాను. నూక లరువడిగయినా తెస్తాను. ఇంత జావ సేద్దువు. గిడుగందుకోయే!" మంచం నుంచి లేచాడు సోములు.



సీతాలు ఇచ్చిన గిడుగును తలపై వేసుకుని, "ఈలోపు పొయ్యి రాజెయ్యి. గబాల్నొస్తాను!" అని వీధిలోకి నడిచాడు.

సీతాలమ్మ పొయ్యి రాజేసే ప్రయత్నంలో పడింది. పక్కన కొడుకు నిలబడి ఉన్నాడు. పదేళ్లు దాటలేదు. ఐదో తరగతి చదువుతున్నాడు. తల్లితో 'అమ్మా! బువ్వ నేదా? అయ్యెప్పుడు తెస్తాడో, నువ్వెప్పుడు వొండుతావో!" అన్నాడు.

తల్లి కొడుకువైపు ఇబ్బందిగా చూసింది. అంతలో అప్పన్న తాత రావడం గమనించి, "అదిగో, అప్పన్న తాతొచ్చాడు. కతలేవో చెప్పమను. గభాల్న బువ్వొండీను!" అని అంది.

అప్పన్న తాత ఇంటి మునంచు దగ్గర కూలబడి, "రార, మనవడా! అమ్మ దగ్గిర పేచీ పెడుతున్నావేట్రా?" దగ్గర కూర్చుండ పెట్టుకుని కుర్రాడిని మాటల్లో పెట్టాడు.

ఆకాశంలో మెరుపులూ, ఉరుములూ పోటీ

## అక్కడ కూడానా?

రాజకీయాలకంటే కూడా సినిమారంగం చాలా ప్రమాదకరమైనదంటారు. నిజమే. ఇక్కడ ఉన్నన్ని గ్రూపిజాలు మరెక్కడా ఉండవు. ఆ మధ్య బ్రహ్మానందం ఛారిటబుల్ ట్రస్ట్ నిధులను దుర్వినియోగం చేశాడంటూ మిగతా కమెడియన్లందరూ రచ్చకెక్కిన విషయం గుర్తుండే ఉంటుంది. ఆ వివాదం సద్దుమణిగిందనిపిస్తున్నా లోలోపల రాజుకుంటూనే ఉంది. తెలుగులో కమెడియన్ల మధ్య అంతగా ఐక్యత లేదనే చెప్పాలి. ఇక్కడే కాదు, తమిళంలో కూడా ఇలాంటి అనైక్యతే ఉందిప్పుడు.

గౌండమణి, మణివణ్ణన్, సెంథిల్, చిన్ని జయంత్, వడివేలు, చార్లీ, పాండు ... వీళ్లంతా ఒక వర్గమైతే, దాము, వివేక్, వయ్యాపురి, చాప్లిన్‌బాలు, బాలాజీ, ప్యారీ వెంకట్ తదుతరులు మరో వర్గమట! ఒక గ్రూపువారితో మరొకరు నటించకూడదని డిసైడ్ చేసుకున్నారట కూడా. బాగానే ఉంది వరస!

ఎల్.

పడుతున్నాయి. సోములు వస్తూండడం చూచి అప్పన్న తాత, "ఏటి సోములూ! సావుకారి కొట్టు కెల్లేవేటి? మీ పాలిట నేనొకడిని!" అన్నాడు.

"లేదు, తాతా! నువ్వలాగనుకోకు. అయ్య తరువాత గ్యాపకంగా నువ్వు తరువాత బండీ ఉన్నారు. ఎలాగొదిలీగలను? మాతోపాటే నువ్వూను!"

గడపలో మాటలు విని సీతాలు వంటింటి నుంచి వచ్చింది. సోములు భుజానున్న మూటనందుకుని,. "ఏటింత బరువుంది? నూకలు తెస్తానన్నావు. బియ్యమూ, పప్పూ తెచ్చావు. ఎక్కడవేటి?"

"ఔనే! సత్తెం సావుకారి బేరం కుదిరినాది. బస్సులు ఈరోజు రాలేదట. వర్షానికి రోడ్డు పాడేపొనాదట. నాలుగు రోజుల వరకు బాగవదట. రేపు పట్నమెల్లి సరుకులు తేవాలట. వేకువనే బండి సిద్ధం సెయ్యమన్నాడు!" అని గడపలో తాత కెదురుగా కూలబడ్డాడు.

"పోతుల కీ రోజు గడ్డేశావా?" అప్పన్న తాత అడిగాడు.

"ఆఁ, ఇయ్యాల పొద్దున్నే ఎల్లి గడ్డి కోసి తెచ్చాను. రేపటి కదే సరిపోతాది!" సోములు అన్నాడు.

"ఆటికి మేతుంటే కదా మనకింత బతుకు!"

"మనకి బతుకే కాదు, తాతా! మా బాబు చదువు కూడా దీనివల్లొచ్చే.. కానీ పరకతోనే కదా!"

"ఔన్లే! ఆడికైన నాలుగు ముక్కలు సదివింపిస్తే నువ్వు పడుతున్న బాదలు ఆడికుండవ్, ఉజ్జోగమేదైనా సేసుకుని సుకపడతాడు!"

కుర్రాడిలో ఆనందం వెల్లివిరిసింది. "ఔను, తాతా! నేను చదువుకుంటాను. మన సర్పంచుగోరబ్బాయి డాక్టరుజ్యోగం చేసినట్టు నేనూ పెద్ద డాక్టరయిపోతాను!" అన్నాడు కుర్రాడు.

సోములు కొడుకును ఆప్యాయతతో దగ్గరకు తీసుకున్నాడు. "నీకు పట్టుదల ఉండాలి కానీ ఎంత కష్టమయినా నిన్ను చదివిస్తాను. కన్నవోరికీ ఉన్నూరికీ మంచి పేరు తెస్తే అదే పదివేలు!" అన్నాడు.

కుర్రాడు అప్పుడే డాక్టరయినంత సంబరపడ్డాడు. "అమ్మా!" అని తల్లిదగ్గరకు తుర్రుమన్నాడు.

చీకటి ముసురుకుంటోంది.

సోములు గడపనుంచి లేస్తూ, "కూర్చో, తాతా! బండొకసారి చూసొస్తాను. పూజా వుండా సరిసేస్తాను!" అన్నాడు.

"నానిక్కడ కూచోని ఏటి సేస్తాను? కష్టమయినా, సుకమయినా మీతోటే! సావయినా, రేవఱునా మీ తోటే!" అని లేచాడు అప్పన్న తాత.

సోములు మనస్సు చివుక్కుమంది. "ఏటి తాతా, ఆ మాటలు?" కసురుతున్నట్టుగా అరిచాడు.

అప్పన్న తాత సోములు వెనక అడుగులు వేశాడు. బయట చీకటి కమ్ముతోంది.

"అమ్మా! బండికాడి కెళ్తున్నానే!" కేకవేసి దీపం బుడ్డి పట్టుకుని వీధిగోలిలోకి నడిచాడు కుర్రాడు.

చినుకులు తగ్గాయి. వాన వెలిసింది. దూరంలో ఏవీ కనిపించలేదు. అంతా చీకటి. గోడపక్కనే బుడ్డీ పట్టుకుని కుర్రాడు ముడుచుకు కూర్చున్నాడు.

బుడ్డీ వెలుగులో సోములూ, అప్పన్న తాత బండి బాగుచేస్తున్నారు.

చుట్టుపక్కల గుమ్మల్లో కప్పల బెకబెకల గోల. చెట్లనుంచి చింతగీరుల రొద!

ఒళ్లు జలదరించే వాతావరణంలో సోములూ, అప్పన్న తాత పనిలో నిమగ్నులయ్యారు. శీలలు బిగించారు. కందెన పూశారు. పూజాకు పలుపులు తగిలించారు. పడుగు సరిచూస్తున్నారు.

అంతలో సీతాలు పెరటి నుంచి వీధిగోలిలోకి వచ్చింది. "ఇంకా బండి పని కానేదా? వంటయిపోయింది. రెండు మెతుకులు తిని యేలమీద పడుకుంటే.. సీకటినే లేవాలి కదా మరి!" బాగుచేస్తున్న బండి వద్దకు వచ్చి నిలబడింది.

"అయిపోవస్తుంది. ఒక సిటమాగు!" సోములన్నాడు.

గోరంత దీపం వెలుగులో గోలి గోడ పెనుభూతంలా కనిపించింది సీతాలుకు!

చూరుమీద గడ్డిపరకలు రెండేళ్లనుంచి వెయ్యకపోవడం వల్ల గోడంతా నాని ఉంది. ఆ వంక భయంతో చూస్తూ, "ఈ యేడేనా యిల్లు నెయ్యాలా. గోడ సూడు, ఎట్టా నానిపోయిందో! ఈసారి ముసురుకు మరీ నానిపోయింది!" సీతాలు అంది.

చక్రం ఇరుసుమీద తిరుగుతున్నదీ, లేనిదీ చూస్తూ, "సీతాలూ! వొచ్చేది సేకు సీజను. బండి అద్దె జాగ్రత్త చేద్దాం. తాతకి బట్టలు, ఇంటికి నేతా ఈసారి చూద్దాం!" ఇంకా ఏదో అనబోతున్నాడు.

గోడమీద నుంచి పెచ్చొకటి రాలి పడింది.

అందరూ తుళ్లిపడి మీదకు చూశారు. అంతే! మిన్ను విరిగి మీద పడేటట్టు ఫెళఫెళమంటూ గోడ ఒక్కసారిగా కూలిపోయింది. ఒకరినొకరు రక్షించుకోవాలనుకుంటూ అందరూ నేల కూలారు. కుర్రాడి చేతిలో బుడ్డి అంతదూరంలో పడి కిరసనాయిలు మంట గుప్పుమంటూ లేచి కుర్రాడి ఆశలాగే టపటప మండి ఆగిపోయింది.

గోడ పడిన చప్పుడు విని ఇరుగూ పొరుగూ వచ్చారు. వార్త గుప్పుమంది.

గ్రామాధికారి వెంటనే పై అధికారులకు తెలియపరిచాడు.

ఆగమేఘాలమీద అధికారులు, పాలకులు వచ్చారు.

పోలీసులు కూడా దిగారు. పంచనామా జరిగింది.

అందరూ విచారిస్తూండగా కలెక్టర్‌గారు ఒక్కొక్క మృతునికి పదివేల రూపాయల చొప్పున తక్షణసహాయం ఎక్స్‌గ్రేషియాగా ప్రకటించారు. పాలకులు పక్కా ఇంటిని శాంక్షన్ చేశారు. గ్రామాధికారిని పిలిచి వెంటనే అమలు చేయాలని ఆదేశించారు.

అప్పుడన్నాడు గ్రామాధికారి నెమ్మదిగా : "ఆ కుటుంబానికి వారసులెవరూ లేరు, సార్!"

